క్లుప్తంగా

ఘనంగా వ్యాసరాజుల ఆరాధన


వ్యాసరాజుల వారికి పూజలు చేస్తున్న ఆలయ పూజారి అక్షయ

ఆదోని అర్బన్: ఎస్కేడీ కాలనీలో వెలిసిన సోసలే వ్యాసరాజుల మఠంలో వ్యాసరాజుల ఆరాధన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పూజారి అక్షయ ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, నైవేద్యం సమర్పించారు.

శ్రీశైలానికి పాదయాత్రగా కన్నడిగులు


పాదయాత్రగా వెళ్తున్న సింధనూరు వాసులు

కోసిగి: భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనార్థం కర్ణాటక భక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా కోసిగి మీదుగా బయలుదేరారు. శుక్రవారం కర్ణాటకలోని మస్కీ, సింధనూరు ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వెళ్లారు. భక్తుల సౌకర్యార్థం కోసిగి కుర్ది పెద్ద నాగరాజు కాంప్లెక్స్‌లో భోజన, తాగునీటి, సేద తీర్చేందుకు వసతులు ఏర్పాటు చేశారు. మండలంలోని రైల్వే గేటు సమీపంలోని సిద్ధరూఢ స్వామి ఆశ్రమం, దుద్ది, కొల్మాన్‌పేట, ఆర్లబండ, చైతన్య స్కూల్, రంగప్ప గట్టు, డి.బెళగల్ ప్రాంతాల్లో భక్తులకు వివిధ రకాలు సౌకర్యాలు కల్పించారు.

గడ్డివాముల దగ్ధం


గడ్డివాములకు నిప్పంటుకున్న దృశ్యం

మద్దికెర: స్థానిక ప్రభుత్వ వైద్యశాల సమీపంలో శుక్రవారం గడ్డివాములకు నిప్పు అంటుకొని దగ్ధం కావడంతో దాదాపు రూ.5 లక్షలు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది పంటలు లేక పోవడంతో పశువులకు గ్రాసం కోసం ఇతర ప్రాంతాల నుంచి వరిగడ్డి కొనుగోలు చేసి తీసుకొచ్చి నిల్వ ఉంచుకున్నారు. అయితే మంటలకు గడ్డివాములు దగ్ధం అయ్యినట్లు బాధిత రైతులు వాపోయారు. వెంటనే అగ్ని మాపక దళానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

పత్తికొండ రూరల్: రిమాండ్ ఖైదీలు బయటకు వెళ్లిన తరువాత నేరాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని పత్తికొండ సబ్‌జైల్ సూపరింటెండెంట్ చంద్రమోహన్ సూచించారు. శుక్రవారం పత్తికొండ సబ్‌జైల్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పుట్టుకతో ఎవరూ నేరస్తులు కాదన్నారు. పరిస్థితుల ప్రభావం, కోపం, పగ క్షణికావేశాలతో నేరాలకు పాల్పడడం వల్ల వారి కుటుంబాలు నాశనమవుతా యని వివరించారు. సన్మార్గంలో నడవాలని సూచించారు. సామాజిక బాధ్యతతో మెలగాలన్నారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు కార్యదర్శి బి.రంగస్వామి, సామాజిక సేవకులు వెంకటేశ్వర్లు, రాజు, సబ్‌జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

27 ఏళ్లుగా మహానందీశ్వరుడి సన్నిధికి

మహానంది: కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన మైసూర్ అమ్మణ పరసే మైలాల గోచార్ సంస్థకు చెందిన భక్తులు 27 ఏళ్లుగా మహానంది, శ్రీశైలం ఆలయాలకు వస్తూ భక్తిని చాటుకుంటున్నారు. సర్వేజనా సుఖినోభవంతు అంటూ ఆ భక్తులు చేస్తున్న పాదయాత్ర అభినందనీయం. శుక్రవారం వారు మహానందికి చేరుకున్నారు. వివిధ రకాల వాయిద్యాలతో శివనామస్మరణ చేస్తూ పూజలు చేశారు. ఉగాది యాత్రలో భాగంగా పాదయాత్ర చేస్తూ గత 27 ఏళ్ల నుంచి మహానందికి వస్తున్నామని, ముందుగా మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి అనంతరం శ్రీశైలం వెళ్తామని చెప్పారు. శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకుని పాదయాత్రగా స్వస్థలానికి చేరుకుంటామని చెప్పారు. మహానంది దేవస్థానం ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, తదితరులు వారిని అభినందించి ఆశీర్వచనాలు చేశారు.

సిద్ధం సభకు తరలిన నాయకులు




ఆదోని నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

ఆదోని టౌన్/రూరల్: ఎమ్మిగనూరు పట్టణంలో వీవర్స్ కాలనీ క్రీడా మైదానంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభకు ఆదోని నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఆయన తనయుడు నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల్లో 9 వేల మందికి పైగా తరలివెళ్లారు. అలాగే వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ ఆధ్వర్యంలో రెండు బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాగలాపురం సర్పంచ్ వీరారెడ్డి, బైచిగేరి సర్పంచ్ మహాదేవ, ఆరేకల్ సర్పంచ్ వీరస్వామి, దొడ్డనగేరి నాయకులు శివశంకర్‌గౌడ్, పెద్దహరివాణం నుంచి సర్పంచ్ రాముడు, మదిరె నుంచి సర్పంచ్ రాముడు, చిన్నహరివాణం సర్పంచ్ రామకృష్ణారెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.


సిద్ధం సభకు వెళ్తున్న మండిగిరి వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు


మంత్రాలయం నుంచి బస్సులో వెళ్తున్న నాయకులు


సభకు తరలుతున్న మాలపల్లి నుంచి గ్రామస్తులు


పాదలకుంట నుంచి తరలివెళ్తున్న నాయకులు


కుంబళనూరు నుంచి బయలుదేరిన దృశ్యం


సభకు వెళ్తున్న రొడూరు వాసులు


కోసిగి నుంచి బయలుదేరుతున్న నాయకులు

మంత్రాలయం : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మేమంతా సిద్ధం పేరుతో ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు వేలాదిగా తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి 141 బస్సులు, 100 టెంపోలు, బొలేరోలు, 4 వేల బైకులపై తరలారు. మంత్రాలయం మండలం నుంచి 30 బస్సులు, 20 టెంపోలు, 1500 బైకులు, కోసిగి మండల నుంచి 41 బస్సులు, 23 టెంపోలు, 500 బైకులు, పెద్దకడబూరు నుంచి 25 బస్సులు, 15 టెంపోలు, 800 బైకులు, కౌతాళం నుంచి 35 బస్సులు, 20 టెంపోలు, 20 కార్లలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెళ్లారు.

కౌతాళం: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండల కేంద్రం నుంచి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో ఉరుకుంద, ఓబుళాపురం, తిమ్మాపురం గ్రామాల నుంచి తరలివెళ్లారు. కుంబళనూరు సర్పంచ్ వీరేష్ ఆధ్వర్యంలో కుంబళనూరు క్యాంపు-1, క్యాంపు-2నుంచి బుచ్చిరాజు, అనిల్ ఆధ్వర్యంలో కాత్రికి నాగభూషణ్‌గౌడ్, రొడూరులో పాండురంగారెడ్డి, సుధకార్‌రెడ్డి, బదినేహాల్ నుంచి వీరభద్రగౌడ్ ఆధ్వర్యంలో, చూడి, బాపురం, నదిచాగి, సుళేకేరి, ఉప్పరహాల్ గ్రామాల నుంచి వందలాది మంది కార్యకర్తలు నాయకులు ఎమ్మిగనూరుకు తరలివెళ్లారు.

కోసిగి: ఎమ్మిగనూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాల్గొన్న మేమంతా సిద్ధం సభకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి, బెట్టనగౌడ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివెళ్లారు.

సిద్ధం సభకు తరలిన నాయకులు

ఆదోని రూరల్: మండలం నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్ ఆధ్వర్యంలో రెండు బస్సుల్లో నాయకులు, కార్యకర్తలు ఎమ్మిగనూరులో జరిగే 'మేమంతా సిద్ధం' సభకు తరలివెళ్లారు. నాగలాపురం సర్పంచ్ వీరారెడ్డి, బైచిగేరి సర్పంచ్ మహాదేవ, ఆరేకల్ సర్పంచ్ వీరస్వామి, దొడ్డనగేరి నాయకులు శివశంకర్‌గౌడ్, పెద్దహరివాణం నుంచి సర్పంచ్ రాముడు, మదిరె నుంచి సర్పంచ్ రాముడు, చిన్నహరివాణం సర్పంచ్ రామకృష్ణారెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.



ఎమ్మిగనూరులో శుక్రవారం నిర్వహించిన 'మేమంతా సిద్ధం' సభలో ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు వై.సాయిప్రసాద్ రెడ్డి, వై.బాలనాగిరెడ్డిలను ప్రజలకు పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శుక్రవారం ఊయలసేవ నిర్వహించారు. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవత అంకాళమ్మకు విశేషపూజలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే


పెద్దకడబూరులో శిలువ యాత్ర

పెద్దకడబూరు: గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండల కేంద్రంతో పాటు చిన్నతుంబళం, కంబళదిన్నె, కంబదహాల్, హెచ్.మురవణి, మేకడోణ తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేస్తు క్రీస్తు శిలువ మార్గంలో పొందిన శ్రమ, ఆయన పలికిన 7 మాటలను పాస్టర్లు వివరించారు. మండల కేంద్రంలో సీఎస్ఐ చర్చ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన యేసు శిలువ యాత్ర పలువురిని ఆకట్టుకుంది. లోకంలో అందరి పాపాలను తొలగించేందుకు కల్వగిరిలో శిలువను భుజం మీద మోసుకొని యేసు ప్రభువు పడిన కష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. యేసు శిలువ యాత్రలో హేరోదు రాజు పిలాతు ఇచ్చిన మరణ తీర్పుతో రాజు భటులు యేసుపై శిలువను మోయించడం, కన్నతల్లి మేరీ మాత ఎదురుపడడం, జెరూ సలేం స్త్రీలు ఎదురుపడి విలపించడం, యేసుక్రీస్తును శిలువకు బంధించి శిక్షించడం లాంటి సన్నివేశాలు అబ్బుర పరిచాయి. సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్‌బాబు, ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ సంజీవ్ రావ్ తదితరులు ఆయా చర్చిల్లో ఉపదేశమిస్తూ ప్రతి ఒక్కరూ క్షమా గుణాన్ని అలవర్చుకొని క్రీస్తు మార్గాన నడవాలన్నారు.

● ఆదోని సెంట్రల్: గుడ్‌ఫ్రైడే పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం చర్చి ఫాదర్ రెవ పాస్టర్ కోలా విజయరాజు, సీఎస్ఐ హోలీ ట్రినిటి చర్చి పాస్టర్లు రెవ భాస్కర్ బాబు, విలియం సుజిత్, సియోను ప్రార్థన మందిరం పాస్టర్ తిమోతి మాట్లాడుతూ ఏసు మరణం ప్రేమ, త్యాగం, విధేయతను చూపిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గాన నడవాలన్నారు. ఆయా ప్రార్థన మందిరాల్లో ఏసు పలికిన ఏడు మాటలను వినిపించారు. అనంతరం సెయింట్ జోసఫ్ పాఠశాల నుంచి ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ కోలా విజయరాజు సిలువను మోసుకొని ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమములో రెవరెండ్ ఫాదర్ కె. బాలరాజు, సిస్టర్స్ సుజనా బృందం పాల్గొన్నారు.


శిలువను ఊరేగింపుగా తీసుకెళ్తున్న ఫాదర్ టోనీ

కోసిగి మండలంలో..

కోసిగి: మండల కేంద్రంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, క్రీస్తు సంఘం చర్చిలతో క్రిష్టియన్లు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. శుక్రవారం ఆయా చర్చిలలో ఫాదర్‌లు రాజారత్నం, ప్రేమ్ కుమార్, ఫాదర్ జాన్సన్‌లు గుడ్‌ఫ్రైడే ప్రత్యేకతను వివరించారు. పాపముల నుంచి ప్రజల విముక్తి చేయడానికి ఏసుక్రీస్తు ముళ్ల కిరీటాన్ని ధరించి, శిలువపై రక్తం చిందిస్తూ ఏడు మాటలు మాట్లాడి ప్రాణాలు అర్పించారన్నారు. మౌంట్ కార్మెల్ స్కూల్ నుంచి ఫాదర్ టోనీ శిలువ మోసి ఊరేగింపుగా రంగప్ప కొండపైకి తీసుకెళ్లి ప్రతిష్టించి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.


ఆదోనిలో శిలువతో పుర వీధుల గుండా తిరుగుతున్న భక్తులు

ఎమ్మిగనూర్ బైపాస్ వద్ద సీఎంకు ఘన స్వాగతం

ఆదోని టౌన్: పట్టణంలోని ఎమ్మిగనూరు బైపాస్ వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎమ్మిగనూరులో 'మేమంతా సిద్ధం' మహాసభ అనంతరం ఆయన బస్ యాత్రగా బయలుదేరి వస్తున్నారని తెలుసుకుని పట్టణ వాసులు పెద్ద సంఖ్యలో బైపాస్ వద్దకు చేరుకున్నారు. బస్ రాగాణే పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున బాణా సంచా పేల్చారు. బస్‌లో నుంచే జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. కొత్త బస్టాండ్ సమీపంలోని ఆస్పరి రోడ్డు బైపాస్‌లోనూ వందలాది మంది ప్రజలు సీఎంను చూసేందుకు తరలివచ్చారు. దారి పొడవునా నిలబడి స్వాగతం పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఆయన దిబ్బనకల్, సాదాపురం, విరుపాపురం, ఆలూరు నియోజకవర్గంలోని నగరూరు, బిణిగేరి, చిగిళి, హాలిగేర, చిరుమాన్‌దొడ్డి, శంకరబండ మీదుగా ఆస్పరికి చేరుకున్నారు. ఆస్పరిలోని నాలుగు రోడ్ల కూడలిలోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి పత్తికొండకు బయలుదేరి వెళ్లారు.

దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీ శిక్షణకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకుడు మారుతీమోహన్, కమిటీ సభ్యుడు రాఘవేంద్రరెడ్డి కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఏకల్ గ్రామోతన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ శిక్షణ మొదటి బ్యాచ్‌కు పూర్తయ్యిందని, ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2వ బ్యాచ్ శిక్షణ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల చివరి నాటికి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ వేలం పాటలు వాయిదా

హొళగుంద: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున హొళగుంద పంచాయతీ వేలం పాటలు వాయిదా వేసినట్లు సర్పంచ్ చలవాది రంగమ్మ, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఏటా మార్చి నెలాఖరులో వారపు సంతమార్కెట్, బస్టాండ్, కమేళా, సుజల స్రవంతి వాటర్ ప్లాంట్ తదితర వాటికి వేలం పాటలు జరుగుతుండేవన్నారు. ప్రస్తుతం కోడ్ అమలులో ఉండడంతో ఎన్నికల తర్వాత వేలం పాట నిర్వహించేందుకు నిర్ణయించామని, తదుపరి తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు.

వైభవంగా వసంతోత్సవం

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి పూర్ణాహుతి, పల్లకీ సేవ, వసంతోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవిని పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా వెళ్లి స్థానిక స్వామి వారి బావి వద్ద వసంతోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గొర్రెల మృత్యువాత


విషపు కొయ్యలు తిని మృతి చెందిన గొర్రెలు

ఆలూరు రూరల్: విషపు జొన్న కొయ్యలు తిని 23 గొర్రెలు మృతిచెందాయి. వివరాలు.. మండలంలోని అంగస్కల్ గ్రామానికి చెందిన పరషప్ప, దేవేంద్రప్ప, నాగరాజుకు చెందిన గొర్రెలు పొలంలో మేతకు వెళ్లాయి. జొన్న కొయ్యకు ఉన్న (నాము) తిని 23 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.3 లక్షల వరకు నష్టపోయినట్లు బాధితులు వాపోయారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్, హనుమంతు శర్మ, అర్చకులు మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.







టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ఇలియాజ్, యూసుఫ్, మన్సూర్, రాఘవేంద్ర ఆచారి, జీవన్‌సింగ్, జమీల్‌షఫీలకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆదోని పట్టణానికి చెందిన పలువురు టీడీపీ శ్రేణులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలో జరిగిన 'మేమంతా సిద్ధం' మహాసభలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో పట్టణానికి చెందిన ఇలియాజ్ మనిహార్, యూనుస్‌మనిహార్, అడ్వకేట్‌లు జీవన్‌సింగ్, మన్సూర్‌అహ్మద్, పెద్దహరివాణానికి చెందిన సీనియర్ నేత రాఘవేంద్ర ఆచారి, జమీల్‌షఫీ టీడీపీని వీడి సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. – ఆదోని టౌన్